క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



సన్మానిస్తున్న తాడూరి శ్రీమాన్

ఎలిగేడు: ఏడాది కాలంలోనే పెద్దపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచి ప్రజాభిమానాన్ని చూరగొని ఎమ్మెల్యే విజయరమణారావు చరిత్ర సృష్టించారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ అన్నారు. మండలంలోని శివపల్లిలోని ఎమ్మెల్యే స్వగృహంలో శనివారం పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్ తాడూరి పుష్పకళతో పాటు ఆయన ఎమ్మెల్యేను సన్మానించారు. నియోజకవర్గంలో 60శాతం జనాభా ఉన్న బీసీలకు జనాభా ప్రకారం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు వారు కోరారు.

దివ్యాంగులకు ఆటల పోటీలు

మంథని: ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా శనివారం మంథని భవిత కేంద్రంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే పోషకులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎస్కార్ట్, రవాణా భత్యాలు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, శారీరక వైకల్యం గల దివ్యాంగులకు శస్త్రచికిత్సలు అందిస్తామని పేర్కొన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. మండల విద్యాధికారి దాసరి లక్ష్మి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, శ్రీలత, ఐఈఆర్పీలు శ్రీనివాస్, సౌజన్య, సీఆర్పీలు మల్లన్న, సుప్రజ, స్వప్న, రాధిక పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మారం: మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయం విద్యార్థులు ఎస్జీఎఫ్ వాలీబాల్ అండర్-19 రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమురయ్య తెలిపారు. విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న హాసిక, సింధుప్రియ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈనెల 10 నుంచి 13 వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికై న విద్యార్థులను విద్యాలయం ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు సంజీవరావు, కొమురయ్య అభినందించారు.

విజేతలకు బహుమతి ప్రదానం



బహుమతి అందిస్తున్న స్వరూప్ కిరణ్‌గౌడ్

సుల్తానాబాద్: హిందూ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థి దశ నుంచి అవగాహన కలిగి ఉండాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు స్వరూప్ కిరణ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. జిల్లాస్థాయిలో మొదటి బహుమతి తాళ్ల సాహిత్య, రెండో బహుమతి తాళ్ల సాయి చరణ్, తృతీయ బహుమతి చాణక్య నిలిచారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి నాగుల మల్యాల సత్యం, సుల్తానాబాద్ ప్రఖండ కార్యదర్శి కుమార్‌రెడ్డి, బొమ్మకంటి రవి, రావికంటి మురళీమోహన్ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో కొర్రీలు పెట్టొద్దు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాలతో తడిసిన ధాన్యంతో పాటు తేమశాతం పేరుతో కొనుగోళ్లలో జాప్యంపై శనివారం అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రతినిధులు నిరసన తెలిపారు. సంఘం జిల్లా ప్రతినిధి మేర్గు చంద్రయ్య మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షాలతో తడుస్తోందని, ఇప్పటికే తడిసిన ధాన్యానికి చెందిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. రైతుల నుంచి ధాన్యాన్ని ఎలాంటి కొర్రీలు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని కోరారు. దొడ్డురకం ధాన్యానికి సైతం రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు కొల్లూరి మల్లేశ్, రాజకొమురయ్య, ఆనంద్, రవికుమార్, రైతులు కొండ రాజయ్య, మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

పేదలకు 'డబుల్' ఆనందం

- 634 మందికి డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు



డ్రా తీస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, అధికారులు

జ్యోతినగర్: ప్రజా ప్రభుత్వ పాలనలో పేదల సొంతింటి కల నేటికి నెరవేరింది. డబుల్ ఇళ్లు పొందిన లబ్ధిదారుల కళ్లల్లో ఆనందభాష్పాలు కనిపించాయి. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 634మంది లబ్ధిదారులకు ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల రోడ్డులోని లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు శనివారం ప్లాట్ల కేటాయింపు డ్రా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపును లాటరీ పద్ధతిలో డ్రా తీసి పేర్లు ప్రకటించారు. 23 మంది దివ్యాంగులకు ముందుగా అపార్ట్‌మెంట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇళ్లు కేటాయించారు. మిగతావి ఆర్డర్ ప్రకారం డ్రా తీశారు. చాలా ఏళ్ల తర్వాత తమ సొంతింటి కల ప్రజా ప్రభుత్వం నెరవేర్చినందుకు ప్రభుత్వానికి, స్థానిక ప్రజాప్రతినిధి మక్కాన్‌సింగ్‌కు, రెవెన్యూ అధికారులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలపడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డికి చప్పట్లతో కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటా



దివ్యాంగుడిగా ఉన్నందుకు ప్రభుత్వం నాకు గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇంటిని అందించడం చాలా సంతోషంగా ఉంది. డ్రా తీయడంలో నా పేరు మొదటగా వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే రాజన్నకు రుణపడి ఉంటాను.

– నంద సతీశ్, పరశురాంనగర్

న్యాయంగా కేటాయించారు



చాలా సంవత్సరాలుగా మేం ఎదురుచూస్తున్న సొంతిటి కల నేటికి నేరవేరింది. మాకు డ్రా పద్ధతిలో కేటాయింపు చేయడం నచ్చింది. ఇక్కడ ఎవరికి ఎలాంటి డబ్బులు ఇవ్వకుండా న్యాయంగా ప్లాట్లను కేటాయిస్తున్నారు. ఇక మా ఇంటికి మేం వెళ్తాం. మా రాజన్న మా ఎమ్మెల్యే మాకు న్యాయం చేసిండు.

– శైలజ, అడ్డగుంటపల్లి

అద్దె భారం తగ్గుతుంది



చాలా ఏళ్ల తర్వాత నాకు ప్రభుత్వం సొంతింటిని కేటాయించింది. వస్తుందో రాదో అనుకున్నాం. కానీ నేటికి మా కల నేరవేరింది. ప్రభుత్వం మాకు, మా కుటుంబానికి నీడ అందించడం ఆనందంగా ఉంది. ఇక మాకు అద్దె ఇంట్లో ఉండే భారం తగ్గుతుంది. త్వరలో మేం మాకు కేటాయించిన ఇంటికి వెళ్తాం. ప్రభుత్వానికి థ్యాంక్స్.

– ఓదెల స్వప్న, 26వ డివిజన్, అడ్డగుంటపల్లి

ఆనందంగా ఉంది



మా రాజన్న మాకు నీడ కల్పించాడు. మాకు ఇంత తొందరగా ఇల్లు కేటాయిస్తరని అనుకోలేదు. చాలా సార్లు ఇలా డ్రా తీశారు. కానీ ఇప్పుడు తీసిన డ్రాలో మా పేరు రావడం ఎంతో ఆనందం గా ఉంది. ఇక మా ఇంటిలో మేము ఉండే అవకాశం మాకు కలగనుంది.

– రంగు వరలక్ష్మి, మార్కండేయ కాలనీ, గోదావరిఖని

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి



గోదావరిఖనిటౌన్: పూజల్లో మనాలీఠాకూర్



మంథని: అభిషేకం చేస్తున్న భక్తులు



ఫెర్టిలైజర్‌సిటీ: అభిషేకంలో పాల్గొన్న భక్తులు



జ్యోతినగర్: పూజలు చేస్తున్న భక్తులు

గోదావరిఖనిటౌన్: స్థానిక జీఎం కాలనీలోని హనుమాన్ ఆలయంలో వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీ ఠాకూర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గుండవేన వెంకటయ్య, అర్చకులు శ్రీనివాసశర్మ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మంథని: సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా మంథనిలోని అయ్యప్పస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతం అయ్యప్పస్వామితోపాటు అనుబంధ ఆలయాల్లో పూజలు చేశారు. వొడ్నాల శ్రీనివాస్, నూకల శంకర్, ఎల్లంకి వంశీ, పుల్లయ్య, రవి, శ్రీనివాస్, ఎంఎన్.రెడ్డి, ఆలయ పూజారి భద్రయ్య ఉన్నారు.

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు కర్నె అశోక్ శర్మ సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకం నిర్వహించారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ వైకుంఠపురం హరిహర ఆలయం ప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ రాంపల్లి వామన శర్మ అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు.

ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడికి సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

గోదావరిఖని: ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డిని ఆర్జీ–1 ఐఎన్‌టీయూసీ నాయకులు శనివారం సన్మానించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు కచ్చకాయల సదానందం, ఎ.కృష్ణ, గడ్డం కృష్ణ, మండ రమేశ్ పాల్గొన్నారు.

టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా రవికుమార్

సుల్తానాబాద్‌రూరల్: రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా యాంసాని రవికుమార్‌ను ఎన్నుకున్నారు. సుల్తానాబాద్ మండలం భూపతిపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులతో పాటు గౌరవ అధ్యక్షుడిగా సుంకిశాల ప్రభాకర్‌రావును ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్రశాఖ అధ్యక్షుడు కటకం రమేశ్ మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్‌గౌడ్, సంఘం నాయకులు ప్రభాకర్‌రావు, మహేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్, విటల్‌శర్మ, రవీందర్‌రావు, రామయ్య, ప్రేమ్‌సాగర్, అల్తాఫ్, దస్తగిరి ఉన్నారు.

కాలనీవాసులను కాలుష్యం నుంచి కాపాడాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ మాతంగికాలనీ వాసులను కాలుష్యం బారి నుంచి కాపాడాలని స్థానిక 39వ డివిజన్ కార్పొరేటర్ జెట్టి జ్యోతి ఎన్టీపీసీ టీటీఎస్‌లోని కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ ఎన్టీపీసీ యాజమాన్యం వారు ముంపు గ్రామాల దృష్ట్యా ఈనెల 19న చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాతంగి కాలనీవాసులకు న్యాయం చేయాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు సమీపంలో ఉన్న కాలనీలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చాలామంది అనారోగ్యాలతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీని స్వాధీనం చేసుకుని పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించినట్లు చెప్పారు. కమిటీ ప్రెసిడెంట్ మారుపాక రమేశ్, సెక్రటరీ కంకల దేవేందర్, ఆకారపు జానకి, లక్ష్మి, తిరుపతిరెడ్డి, ప్రదీప్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఆర్టీసీ బస్సును ఢీకొన్న బొలెరో

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ బస్టాండ్ వద్ద శనివారం ఆర్టీసీ బస్సును బొలెరో ఢీకొట్టింది. కానీ ఎవరికీ గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని బస్సులో ఉన్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖని నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సుల్తానాబాద్ బస్టాండ్‌లోకి వెళ్తుండగా కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపునకు వెళ్తున్న బొలెరో బస్సును ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

• చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన

పెద్దపల్లిరూరల్: బాలల హక్కులు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ డీఆర్‌డీవో రవికుమార్ అన్నారు. జిల్లా సమాఖ్య కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో అవగాహన కల్పించారు.

• 11న ఇసుక వేలం

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి మానేరు సమీపంలో సీజ్ చేసిన ఇసుకను వేలం వేయనున్నట్లు శనివారం తహసీల్దార్ సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 60ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక విలువ రూ.1,13,400 ఉందని పేర్కొన్నారు. ధరావత్ రూ.5వేలు చెల్లించాలన్నారు. డిసెంబరు 11న తహసీల్దార్ కార్యాలయంలో వేలం ఉంటుందని తెలిపారు.

• పీడీఎస్ బియ్యం పట్టివేత

పాలకుర్తి: బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. చింతల విజయ్ అనే వ్యక్తి 25క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నాడనే సమాచారం మేరకు అధికారులు మహేశ్, రవీందర్ కన్నాల టోల్‌ప్లాజా వద్ద రేషన్‌బియ్యంతో ఉన్న వాహనాన్ని పట్టుకున్నారు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

• కాట్నపల్లి వద్ద..

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కాట్నపల్లి వద్ద ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని శనివారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మార్కండేయ కాలనీకి చెందిన బాలు తన ఆటోలో దాదాపు 4.50క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకొన్నారు. ఆటోను సీజ్‌చేసి బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

• పీఈటీపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కడారి రవిపై దాడికి పాల్పడ్డ రౌతు సతీశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. అదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అంజి తరగతి గదిలో దురుసుగా ప్రవర్తించడంతో బయట నిల్చోవాల్సిందిగా పీఈటీ రవి ఆదేశించాడు. దీంతో ఆ విద్యార్థి తన తండ్రికి సమాచారం ఇవ్వడంతో సతీశ్ ఆగ్రహంతో వచ్చి పీఈటీపై దాడికి పాల్పడ్డట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోండి

పెద్దపల్లిరూరల్: వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వెలమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్‌రావు కోరారు. వెలమ సంఘం నాయకులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

• అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో శనివారం అకాల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం కుప్పలపై రైతులు టార్పాలిన్లు కప్పారు.

• వరికొయ్యలు కాల్చొద్దు

పాలకుర్తి: యాసంగి సాగుకు సిద్ధమవుతున్న రైతులు తమ పంటపొలాల్లోని వరికొయ్యలు కాల్చొద్దని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ తెలిపారు. పాలకుర్తి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పంటకోసిన రైతులకు శనివారం ఆయా క్లస్టర్ల ఏఈవోలు పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. ఏఈవోలు శశిధర్, యోజన పాల్గొన్నారు.

• దత్తాత్రేయ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

మంథని: మంత్రపురిగా పిలువబడే మంథనిలో ప్రసిద్ధిగాంచిన శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయంలో శనివారం నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి గణపతి పూజ, అభిషేకంతో పాటు ఇతర పూజలు నిర్వహించారు.

• శరవేగంగా తాగునీటి సంపు నిర్మాణ పనులు

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్ ఏరియాకు చెందిన ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ, భరత్‌నగర్, తబితా ఆశ్రమం వీధి వైపు ఉన్న కాలనీలకు తాగునీటి సమస్య త్వరలోనే తీరనుందని కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం సంపు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి నాణ్యతతో ఉండాలని సూచించారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న పోస్టల్ అధికారులు

ధర్మారం: మండలంలోని నందిమేడారం పంచాయతీలో ఎంపీడబ్ల్యూ వర్కర్‌గా పనిచేస్తున్న ఎల్తూరి సత్తయ్య ఇటీవల మంచినీటి ట్యాంకు కూలి మరణించాడు. కాగా వారి కుటుంబానికి పోస్టల్‌శాఖ ద్వారా మంజూరైన రూ.10లక్షల ప్రమాదబీమా చెక్కు శనివారం తహసీల్దార్ ఆరిఫ్, ఎంపీడీవో ప్రేమ్‌కుమార్ మృతుడి భార్య శంకరమ్మకు అందజేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, మాజీ సర్పంచు సామంతుల జానకి, శంకరయ్య, మాజీ ఉపసర్పంచు కట్ట రమేశ్, మాజీ ఎంపీటీసీలు మిట్ట తిరుపతి, డీఎల్‌పీవో వేణుగోపాల్, ఎంపీడీవో ప్రేమ్‌కుమార్, బీపీవో సునీత, ఎంపీవో రమేశ్, కార్యదర్శి ప్రత్యూష పాల్గొన్నారు.



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ ఇందిరానగర్ ఏరియాలో వేపచెట్టును తొలగించకుండానే సీసీరోడ్డు నిర్మించారు. సీసీరోడ్డు మధ్యలో చెట్టు ఉండడంతో అటు వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, ఆటో సైతం పోలేని పరిస్థితి ఉంది. సీసీరోడ్డు నిర్మించిన సమయంలో సంబంధించిన కాంట్రాక్టర్, అధికారులు చెట్టు తొలగించకుండా నిర్లక్ష్యంగా వదిలేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధించిన అధికారులు రోడ్డు మధ్యలో ఉన్న చెట్టును తొలగించాలని ఏరియావాసులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జీఎం బి.వెంకటయ్య

గోదావరిఖని: సింగరేణి ఆవిర్భావ దినోత్సవం ఈనెల 23న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య పిలుపునిచ్చారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కీర్తిని తెలియజేసేలా గనుల నమూనాలు, రెస్క్యూ, వైద్య, అటవీ, పర్యావరణం, సింగరేణి సేవాసమితి స్టాల్స్ అబ్దుల్ కలాం స్టేడియంలో ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేలా సమన్వయం చేయాలన్నారు. ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, ఎ.నెహ్రూ, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, ఏరియా రక్షణ అధికారి సంతోష్‌కుమార్, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, పర్సనల్ డీజీఎం ఎస్.అనిల్‌కుమార్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, స్టోర్స్ డీజీఎం సుజన్ మెహ్రా, ఈఅండ్ఎం డీజీఎం జనార్దన్ పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ఆపరేషన్స్, ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు

రామగిరి: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో అనుకున్న లక్ష్యం చేరేవరకు ముందుకు సాగాలని ఆపరేషన్స్, ఈఅండ్ఎం డైరెక్టర్ డి.సత్యనారాయణరావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్జీ–3, ఏపీఏ వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో సెంటినరికాలనీ సీఈఆర్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. గోదావరిఖని మనోచైతన్య, పరిసర గ్రామాలు, పాఠశాలల నుంచి హాజరైన దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు, కార్పొరేట్ భూగర్భగనుల విభాగం జీఎం రఘురాంరెడ్డి, ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎం గుంజపడుగు రఘుపతి, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు డి.టి.రావు, శ్రీనివాస్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, గౌరవ కార్యదర్శి సునీల్ ప్రసాద్, స్పోర్ట్ కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, క్లబ్ సెక్రటరీ బెల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి ప్రభావిత గ్రామాల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామాల అభ్యున్నతికి సింగరేణి సంస్థ కృషి చేస్తుందని ఆర్జీ–2 ఏరియా జీఎం వెంకటయ్య అన్నారు. సింగరేణి ప్రభావిత గ్రామమైన యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరులో శనివారం ఆర్జీ–2 సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి యజమాన్యం పరిసర ప్రభావిత గ్రామాల అభివృద్ధికి నిధులు వెచ్చించి ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. సింగరేణి వైద్యులు ప్రజలకు వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆర్జీ–2 ఎస్‌వోటూ జీఎం రాముడు, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, ఏఐటీయూసీ ఆర్జీ–2 బ్రాంచ్ సెక్రటరీ రవీందర్, డీజీఎం పర్సనల్ అధికారి అనిల్‌కుమార్, డివిజన్ కార్పొరేటర్ అంజలీదేవి, సింగరేణి వైద్యులు మహిపాల్, పర్యావరణ అధికారి వేణు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలి



కమాన్‌పూర్: నిరసనలో ఆటోడ్రైవర్లు



సుల్తానాబాద్: వినతిపత్రం ఇస్తున్న ఆటోడ్రైవర్లు

జూలపల్లి: ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేసి ఆటోడ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు మద్దెల నరేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు అయాబ్, సందీప్, వెంకటరమణ, అశు, అజ్జూ, మహేందర్, తాజోద్దీన్, సాయి పాల్గొన్నారు.

సుల్తానాబాద్: ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నాన్ పొలిటికల్ జేఏసీ ఆటో డ్రైవర్, ఓనర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల నాంపల్లి కోరారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సురేశ్, అంజనేయులు, స్వామి, శ్రీనివాస్, అశోక్, సదయ్య, అరుణ్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో ఆటోడ్రైవర్లు ఆటోలు బంద్ చేసి నిరసన తెలిపారు.

ఓదెల: మండలంలో ఆటోల బంద్ సంపూర్ణంగా జరిగింది. ఆటో యూనియన్ అధ్యక్షుడు జెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు మేకల శ్రీకాంత్, నాయకులు శ్రీనివాస్, సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్, శ్రీధర్, సది, శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.